తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక



హైదరాబాద్ మంగళవారం 03 - 11 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి..

ధాన్యం మద్దతు ధరకు కొనాలి

మాజీ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాంపాక నాగయ్య



- **తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి**
- **రైతులకు వారం రోజుల్లో డబ్బులు చెల్లించాలి**

ప్రజావారధి/మోత్కూరు

రైతులు పండించిన పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని మాజీ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాంపాక నాగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమై సుమారు నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఇప్పటికే సాగునీరు లేక, కరెంట్ కోతలతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని, పండిన కొద్ది పంటను కూడా అమ్ముకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలును ప్రారంభించాలని, మద్దతు ధరకు కొనుగోలు చేసి వారం రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు రైతులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, ధాన్యం కొనుగోళ్లపై సీఎం గానీ, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటి వరకు అధికారులతో సమీక్షలు జరిపిన పాపాన పోలేదని, రైతులను గాలికొదిలేసి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీ యాత్రలు, దావత్‌లు చేస్తున్నారని ఆరోపించారు. కరెంట్ కోతలతో పంటలు ఎండిపోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాన్నెబోయిన రమేష్, మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండ సోమల్లు, బీసీ సెల్ అధ్యక్షుడు పానుగుల్ల విష్ణుమూర్తి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాన్నెబోయిన మత్స్యగిరి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

మంగళవారం

జనరల్ న్యూస్

03 - 11 - 2026

గౌడ సంఘం మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని

అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గౌడ సంఘం నాయకులు, గౌడ ఉద్యోగులు



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అన్నెపు బజార్‌లో గౌడ సంఘం స్థలంలో చేపడుతున్న మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మోత్కూరు ప్రజావాణిలో సోమవారం ఆ సంఘం నాయకులు, గౌడ ఉద్యోగులు ప్రజావాణి నోడల్ అధికారి, ఎంపీడీవో బాలాజీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కేంద్రంలోని అన్నెపు బజార్ లో సర్వే.నెం.448 లో తాలూకా గౌడ ఉద్యోగులకు చెందిన 10 గుంటల స్థలంలో మినీ ఫంక్షన్ హాల్ కోసం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులతో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చేపడుతుండగా ఆ స్థలంతో ఎలాంటి సంబంధం లేని కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని తెలిపారు. 1982లో డాక్యుమెంట్ నెంబర్ (692/1982) ద్వారా తాము 10 గుంటల భూమిని కొనుగోలు చేశామని చెప్పారు. పనులను అడ్డుకుంటున్న వారిపై మున్సిపల్ కమిషనర్, ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మంత్రి వెంకట్ రెడ్డి మంజూరు చేసిన నిధులతో చేపట్టిన గౌడ సంఘం మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వారిపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలూకా గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బీసు రాములు, ప్రధాన కార్యదర్శి గూడ రాజబోసు, ఉపాధ్యక్షుడు పరకాల నర్సయ్య, బత్తిని సోమయ్య, గీత సొసైటీ అధ్యక్షుడు మొరిగాల సురేష్, ఉపాధ్యక్షుడు బీసు రవి, డైరెక్టర్లు బొడిగే శ్రీహరి, సుధగాని కిష్టయ్య, బీసు సత్తయ్య, బందారపు యాదగిరి, మాజీ అధ్యక్షుడు బుర్ర యాదయ్య, గౌడ సంఘం ప్రతినిధులు మొరిగాల వెంకన్న, బీసు యాదగిరి, ఉయ్యాల అంజయ్య, మొరిగాల శ్రీనివాస్, సోమయ్య, బుర్ర నర్సయ్య, కోల శ్రీనివాస్, కట్టెకోల మహేష్ తదితరులు పాల్గొన్నారు.